క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎస్సై బాధ్యతల స్వీకరణ


ఎస్సై సురేష్‌రెడ్డి

పాలకవీడు: ఇన్‌చార్జ్ ఎస్సైగా సురేష్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై లక్ష్మీనర్సయ్య రాచకొండకు బదిలీపై వెళ్లారు. ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్సై సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూస్తానని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన గుడిపల్లి సీతయ్య (55) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబానికి బుధవారం నడిగూడెం మండల కేంద్రానికి చెందిన సీతారామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వల్లెపు శ్రీనివాస్ 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడిపల్లి వినోద్, దున్న గుర్వయ్య, పల్లపు తిరుమలేష్, దేవరంగుల రాము, పల్లపు నాగరాజు, ఉప్పతల శ్రీను, గుంజ మురళి, రాము, రాజశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీలోని రాజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు కందుకూరి అనసూర్య మనుమడు జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం ఆమె విద్యార్థులకు ఎంఈఓ పూట్లూరి సత్యనారాయణరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు చేతుల మీదుగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనయ్య, నాగిరెడ్డి తదితరులున్నారు.

నేటితో ముగియనున్న డిగ్రీ అడ్మిషన్ల గడువు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లకు గురువారంతో గడువు ముగియనుందని కళాశాల ప్రిన్సిపాల్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఇదే చివరి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ సౌకర్యం ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ నగేష్ సెల్ నంబర్ 99639 41397ను సంప్రదించాలని కోరారు.

రేపు బేతవోలు దేవాలయ భూమి కౌలు వేలం

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో గల సీతారామచంద్రస్వామి దేవాలయం భూమి 23 ఎకరాలకు సంబంధించి కౌలు వేలం పాటను శుక్రవారం ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మృత్యుంజయ శాస్త్రి బుధవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనే రైతులు ముందుగా రూ.25 వేలు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. రెండేళ్లకు సంబంధించి కౌలు వేలం ఉంటుందని తెలిపారు.

దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం

కోదాడరూరల్ : మండల పరిధిలోని అశోక్‌నగర్‌లో గల రాధాకృష్ణా దివ్యాంగుల కేంద్రంలో గరిడేపల్లి మండలం పరెడ్డిగూడేనికి చెందిన లక్కమల్ల జానయ్య నాగమణి దంపతుల కుమార్తె తన్మయి జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రాములు, సైదమ్మ, నాగయ్య, ఉమా, రాజు, ఉషా, వర్షిత్, లిషిత పాల్గొన్నారు.

అర్హులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కోదాడరూరల్(అనంతగిరి): కొత్తగా పాస్‌పుస్తకం వచ్చిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ అన్వేష్ అన్నారు. బుధవారం అనంతగిరి మండల పరిధిలోని త్రిపురవరం రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మంద కృష్ణ మాదిగ సన్మాన సభను విజయవంతం చేయాలి

నడిగూడెం : పద్మశ్రీ పురస్కారం పొందిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు గురువారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష కోరారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్ కుమార్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకురాలు రావి స్నేహలత చౌదరి, మండల అధ్యక్షుడు నూకపంగు గుర్వయ్య, వెంకన్న, సన్నీ, వంశీ, రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

- ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్లు
- ట్రాన్స్‌ఫార్మర్లను అల్లుకుపోయిన కంపచెట్లు


శ్రీరామనగర్ కాలనీలో చెట్ల కొమ్మలతో అల్లుకుపోయిన విద్యుత్ తీగలు


మేళ్లచెరువు మండలం గాంధీనగర్ తండా వద్ద కంపచెట్లలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మేళ్లచెరువు : మండలంలో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంప చెట్లు, పిచ్చి మొక్కలు అల్లుకొని పోవడంతో గాలి వచ్చినప్పుడు మంటలు వచ్చి లైన్లు ట్రిప్ అవుతున్నాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించకపోవడంతో చిన్నపాటి గాలిదుమారాలకు సైతం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండల కేంద్రం శివారులోని శ్రీరామనగర్ కాలనీలో తీగలు ఒకదానికోటి మలుచుకొని సమయంలో మంటలు వ్యాపించాయి. మండలంలోని రేవూరు సమీపంలోని రైతుల పొలాల్లో తీగలు కిందకు వేలాడడంతో మేత కోసం వచ్చిన గేదెలు మృతిచెందాయి. ప్రమాదాలు జరగకముందే లైన్లు పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

నడిగూడెం : బ్యాంకు బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ అన్నారు. బుధవారం నడిగూడెం మండల పరిధిలోని సిరిపురంలో ఇటీవల జంపాల దేవకమ్మ (48) గుండెపోటుతో మృతి చెందింది. మృతురాలు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకానికి ఎస్‌బీఐ ద్వారా రూ.436లు బీమా చెల్లించింది. ఈమేరకు మంజూరైన రూ.2లక్షల చెక్కును బుధవారం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సిరిపురం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ దినేష్ కుమార్, నడిగూడెం ఎస్ఐ అజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాంపల్లి సతీష్ కుమార్, వీఏఓ రామయ్య, విడ్స్ క్లస్టర్ కో ఆర్డినేటర్ నాగరాజు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త సమ్మె

మునగాల: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి జూలై 29న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో హమాలీ సంఘం కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు కోరారు. బుధవారం మునగాల మండల కేంద్రంలోని వివిధ రైస్‌మిల్లుల్లో పనిచేస్తున్న హమాలీ సంఘం కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీరంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం వెల్ఫేర్‌బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మిక హక్కులను హరించడమేనన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జూలై 29న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.


సమావేశమైన హమాలీ కార్మిక సంఘం నాయకులు

సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం, హమాలీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల మైసయ్య గౌడ్, నాయకులు వేట అంజయ్య, జానయ్య, సాలయ్య, రాంబాబు, నాగయ్య, రవి, శ్రీను, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న కోటేష్

మునగాల: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 7న గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెలను ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మునగాల మండలంలోని తాడువాయి, విజయరాఘవపురం, కలకోవ గ్రామాల్లోని హరిజన కాలనీలో ఎంఎస్పీ మండల శాఖ అధ్యక్షుడు శ్రీను మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రస్థానాన్ని ప్రదర్శించాలన్నారు. మాదిగల కోసం మంద కృష్ణ చేసిన పోరాటం గ్రామాల్లో తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి జిల్లేపల్లి లింగరాజు, నాయకులు జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, కోట ప్రవీణ్, భాస్కర్, శ్రీను, రాగిశెట్టి నర్సయ్య, కోట రమేష్, కోట సైదాబాబు, దుర్గయ్య పాల్గొన్నారు.

పిల్లల్లో అతిసార వ్యాధిని నియంత్రిద్దాం

మఠంపల్లి: పిల్లల్లో అతిసార వ్యాధి నియంత్రణకు వచ్చేనెల 31వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ తెలిపారు. బుధవారం మఠంపల్లిలోని పీహెచ్‌సీలో మండల స్థాయి టాస్క్‌ఫోర్సు సమావేశం నిర్వహించారు. అనంతరం వైద్యసిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీష్‌కుమార్, ఎంఈఓ వెంకటాచారి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మఠంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కౌలు వేలం ద్వారా రూ.12.57 లక్షల ఆదాయం


వేలంలో పాల్గొన్న ఆలయ అధికారులు, రైతులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరిలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ భూములను ఆరు బిట్లుగా విభజించి కౌలుకు ఇచ్చేందుకు బూరుగడ్డ ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణ్ పర్యవేక్షణలో బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.12.57 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంగులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మేళ్లచెరువు : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ సూచించారు. బుధవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల నాయకులు కాకునూరి భాస్కరరెడ్డి, నరాల కొండారెడ్డి, రామ్మూర్తి, రామకృష్ణారెడ్డి, లకావత్ సైదులు, కృష్ణారెడ్డి, బాలరాజు, అంతయ్య గౌడ్ పాల్గొన్నారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

హుజూర్‌నగర్ : యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని ఆయుష్ ఆఫీసర్ డాక్టర్ సతీష్ రెడ్డి, యోగా ట్రైనర్ రామాంజనేయరెడ్డి అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా డే సందర్భంగా బుధవారం హుజూర్‌నగర్‌లోని బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు యోగా ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. యోగా ఆసనాలు, ధ్యానం, యోగా ప్రణామాలు నేర్పించారు. కార్యక్రమంలో ఆయుష్ ఫార్మసిస్ట్ శంకర్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

చెత్త వేరుచేసే విధానంపై అవగాహన ఉండాలి


తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి

నేరేడుచర్ల : తడి, పొడి చెత్తను వేరుచేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ బుధవారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఫ్రైడేను డ్రై డేగా గుర్తించి పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. నూతన సమభావన సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మెప్మా, కార్యాలయ సిబ్బంది, వివిధ సంఘాల సభ్యులు తదితరులున్నారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ


డైరీలు అందుకున్న విద్యార్థులు

మఠంపల్లి: మండలంలోని పెదవీడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిలుకూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన వేముల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మిజోరాం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ముత్తు వేముల అందించిన డైరీలను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బుధవారం పంపిణీ చేశారు. డైరీలను అందించిన ముత్తును, అందుకు సహకరించిన పాఠశాల ఉపాధ్యాయుడు రెమిడాల సైదులును ప్రధానోపాధ్యాయుడు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, నాగలక్ష్మి, ఇందిరా, స్టెల్లా, శాంత కుమారి, ఇస్మాయిల్, ఉపేందర్‌రెడ్డి, యుగంధర్ రెడ్డి, జ్యోతిబాబు, రాజా, గురుప్రసాద్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

హుజూర్‌నగర్ : విద్యాహక్కు చట్టం, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించలేదని, మౌలిక వసతులు కల్పనకు కృషి చేయలేదని పేర్కొన్నారు.

బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేత


నోట్‌బుక్స్ అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

గరిడేపల్లి: మండలంలోని కట్టవారిగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం పాస్టర్ ఊట్కూరి రాజు బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాల్‌దూరి సందీప్, మాజీ వైస్ సర్పంచ్ గందే ఉపేంద్రరావు, మాజీ వార్డు మెంబర్ ఊటుకూరు వెంకయ్య, కార్యదర్శి మన్సూర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు

చిలుకూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు మాట్లాడుతూ పారదర్శకత కోసమే పంచాయతీ ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జీపీఎస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీప్రసన్న

నడిగూడెం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న కోరారు. బుధవారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ హరిసింగ్, నడిగూడెం పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్ హరినాథ్, ఎంపీఓ విజయకుమారి, ఏపీఓ రవీందర్, ఈసీ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

హుజూర్‌నగర్ : క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధారా రాంబాబు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఈమేరకు విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి కైవసం చేసుకున్న కేకేఆర్ యూత్ కెప్టెన్ గుంజ పిచ్చయ్య, టీం సభ్యులకు రూ.50 వేల నగదు, మెమోరియల్ కప్ అందజేశారు. ద్వితీయ బహుమతి గెలుచుకున్న సాముల రామిరెడ్డి యువసేన కెప్టెన్ కర్నె కృష్ణకు రూ.30 వేల నగదు, రన్నరప్ కప్ అందజేశారు. మూడో బహుమతి మట్టపల్లి రావు యూత్, నాల్గవ బహుమతి 11 బుల్లెట్స్ టీమ్‌కు అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు నవీన్ కుమార్, బాబా, కృష్ణ, నరసింహారావు, హుస్సేన్, రవి భాస్కర్, శ్రీకాంత్, కిరణ్, హనీ, సలీం, సాయి, వేణు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రామిరెడ్డి

రోడ్డు వేశారు.. మార్జిన్‌ను మరిచారు


ప్రమాదకర మూలమలుపు వద్ద ఏర్పాటు చేయని స్పీడ్ బ్రేకర్

- ఇరుపక్కలా మట్టి పోయకుండా వదిలేసిన కాంట్రాక్టర్
- మూలమలుపు, మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేయని స్పీడ్‌బ్రేకర్లు

మునగాల: మండల కేంద్రం నుంచి గరిడేపల్లి మండలం కీతవారిగూడెం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డును రూ.10కోట్లతో డబుల్‌రోడ్డుగా మార్చారు. ఈక్రమంలో మండల కేంద్రంలో 800మీటర్ల మేర నిర్మించిన సీసీరోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసిన కాంట్రాక్టర్ ఇరుపక్కలా మార్జిన్‌పై మట్టి పోయకుండా వదిలివేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా గణపవరం వెళ్లే దారిలో నిర్మించిన సీసీరోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుతో పాటు మోడల్‌స్కూల్ ఎదురుగా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.


మట్టిపోయకుండా వదిలివేసిన మార్జిన్

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



కీతవారిగూడెం వరకు వేసిన రోడ్డుకు ఇరుపక్కలా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి మట్టిపోయాలి. అదేవిధంగా మూలమలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. మార్జిన్‌పై మట్టి పోయకపోవడం, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– ఉప్పుల జానకిరెడ్డి, మునగాల

మట్టి పోయిస్తాం

మండల కేంద్రంలో ఇటీవల రూ.10కోట్లతో సుమారు 800మీటర్ల పొడవు, ఏడు మీటర్ల వెడల్పుతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తయింది. ఇరుపక్కల మార్జిన్‌పై మట్టిపోయాల్సి ఉంది. ప్రస్తుతం మట్టి దొరకకపోవడంతో కాంట్రాక్టర్ ఆలస్యం చేస్తున్నాడు. వీలైనంత త్వరలో ఇరుపక్కలా మట్టిపోయిస్తాం.

– సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ, మునగాల

బీటీరోడ్డు పనులు ప్రారంభం

హుజూర్‌నగర్ : మండలంలోని లక్కవరం నుంచి మగ్దూంనగర్ వరకు రూ 2.20 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ వీరారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు దొంగరి వెంకటేశ్వర్లు, ముడెం గోపిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్ నాయకత్వంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయయన్నారు. రోడ్డుకు నిధులు మంజూరు చేసిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ సైదులు, సీహెచ్ గురుపాదం, మధు, జార్జి, కోటయ్య, శాంతయ్య, రామయ్య, మైసయ్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


బీటీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న వీరారెడ్డి

ప్రజలను చైతన్యం చేయడమే ప్రజా భరోసా లక్ష్యం

సూర్యాపేటటౌన్ : ప్రజలను చైతన్యం చేయడమే పోలీస్ ప్రజా భరోసా లక్ష్యమని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని 24వవార్డులో నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు మరింత చేరువయ్యేందుకే పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వార్డులలో సామాజిక అంశాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల సహకారం లేకుండా పోలీస్, న్యాయ వ్యవస్థ పటిష్టంగా పనిచేయడం సాధ్యపడదన్నారు. ప్రజలంతా చట్టాన్ని గౌరవిస్తూ, అన్యాయాన్ని సహించకుండా ముందుకు వస్తే పోలీస్ శాఖ మేమున్నామంటూ భరోసా ఇస్తుందన్నారు. సమాజంలో యువత మాదక ద్రవ్యాలకు, ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసలు కాకుండా, చదువు, ఉద్యోగాలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ప్రధానమన్నారు. ప్రతి బుధవారం ఒక వార్డును ఎంచుకొని పోలీస్ అధికారులు పాల్గొనేలా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ మేఘ్య, వార్డుపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్